

చెహోవ్ కథలు



# పతివ్రత

రష్యన్ మూలం: చెహోవ్

తెలుగు గొంతు: కరుణారుణ

ముసలి పోస్ట్‌మాస్టర్ పడుచుభార్య మరణించింది. ఆమెను సమాధి చేసివచ్చి, సాయంత్రం పోస్ట్‌మాస్టర్ని పరామర్శించడానికి సమావేశమయ్యారు.

టేబుల్ మీద స్వీట్లూ, ఇతర భోజనపదార్థాలూ ఉన్నాయి.

"ఆహా, ఆ బంగారు రంగు, ఆ గులాబీ రంగు. ఆమె అందం కుసుమసుకుమారం కదా."

"అవును బాబూ. అది అదే నా భార్య గొప్ప సౌందర్యవతి. అందులో ఏమీ సందేహం లేదు. కాని నేను దాన్ని ప్రేమించింది శరీర లావణ్యానికి కాదు. శరీరాకర్షణకన్నా దాని ఆత్మసౌందర్యం చాలా గొప్పది. ఆ లేడి నడక. సీతాకోకచిలకల్లాంటి ఆ కన్రెప్పలు. కాని దాని ఆత్మవున్నత్యం ఎంత గొప్పదో. నాకు అరవైఏళ్లు. దానికిరవై. అయినా అది గొప్ప పతివ్రత. పరపురుషుణ్ణి కన్నెత్తి చూసేది కాదు. ఎవర్నీ తనవైపు చూడనిచ్చేది కాదు."

"అంత నమ్మకమేమిటి?"

"నాకు తెలుసులే. మీరు నమ్మరు."

"అలా కాదు. కాని ఈ రోజుల్లో పడుచుపిల్లలు.. సరే. చెప్పేదేముందిలే"

"నేను నిరూపిస్తాన్నా కుర్రనాయన్లారా. ఎవడూ దానివైపు కన్నెత్తి చూడకుండా వుండటానికి కొన్ని ఎత్తుగడలు ప్రయోగించాను. నాదెంత పకడ్బందీ వ్యూహమంటే దానికి తిరుగులేదు. నా జాగ్రత్తలు నేను తీసుకోకపోతే అది ఒక్కరోజు కూడా నా దగ్గర వుండదని నాకు తెలియదేమిటీ. ఇంత చెప్పానా. చేసింది మాత్రం చాలా సులభం. రెండు అంటే రెండు మాటలు చాలు. దాన్ని కట్టిపడెయ్యటానికి."

"ఏమిటా మాటలు?"

"సింపుల్. ఊర్లో నేనే పుకారు పుట్టించాను. నా భార్య పోలీసు సూపర్నెంటుకు ఉంపుడుగత్తె అని. అది చాలదూ! పోలీసు సూపర్నెంట్ ఎలాంటి రాక్షసుడో అందరికీ తెలుసు. అంతే. ఎవ్వడైనా నా భార్యవైపు చూడటానికే భయపడేవాడనుకో. అసలు, నా భార్య కనిపిస్తే చాలు మగాళ్లు దూరంగా పారిపోయేవాళ్లు. ఎవడైనా నా పెళ్లాంవైపు చూశాడని తెలిసినా, నా పెళ్లాం ఎవడి వైపైనా చూసిందని తెలిసినా వాడికి రోజులు చెల్లిపోయినట్టే కదా. అలాగ నా భార్య చేయగలిగిందేమీ లేక నా సేవ చేసుకుని బతికింది. ధన్యురాలు.

"అంటే, నీ భార్య నిజంగా పోలీసు సూపర్నెంట్‌కు ఉంపుడుకత్తె కాదన్నమాట"

"అహ్హాహ్హా. అస్సలు కాదు"

మాకొళ్లు మండిపోయింది.

"మళ్లీ ఎప్పుడు పెళ్లి చేసుకుంటావు?" అని అడిగాం ఆశగా. ■



## బ్రషింగ్‌తో దంతరక్షణ

మామూలుగా బ్రష్ చేసుకోవటమూ, వొత్తిడితో గట్టిగా బ్రష్ చేసుకోవటమూ వేరు. గట్టిగా బ్రష్ చేసుకోవటం పనికి రాదంటున్నారు దంతవైద్యులు. గట్టిగా రుద్దుకోవటం వల్ల పళ్లు తెల్లబడవు, శుభ్రం కావు. పైగా అంత గట్టిగా రుద్దుకోవటం వల్ల పళ్లకు హాని కలుగుతుంది. పళ్ల మీదున్న ఎనామెల్ తొలగిపోయి, వాటిని బలహీనం చేస్తుంది. పళ్ల చుట్టూ వున్న చర్మంలో పోటు వస్తుంది. తీపి, కారం, పులుపు, చల్లని, వేడి పదార్థాలేవి తగిలినా జివ్వుమంటుంది. చిగుళ్లను వెనక్కు తోసి, పళ్ల మూలాలకు బలం తగ్గి ఇన్ఫెక్షన్లు కూడా వస్తాయి. బ్రష్‌ను చేత్తో పట్టుకుని నిలువుగా పళ్లు తోముకోవటం ఉత్తమమని చెబుతున్నారు దంతవైద్యులు. దీని వల్ల వేగంగా బ్రష్ చేసుకోవటానికి కుదరదు. చక్కగా బ్రష్ చేసుకోవటం వల్ల ఇబ్బందులను తొలగించుకోవచ్చు.

ఎన్.